పోలీసుల కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు గంజాయి రవాణా, నేర నియంత్రణలో భాగంగా మహారాణిపేట పోలీసు స్టేషన్ లిమిట్స్‌లో ఉన్నటువంటి ఆంటోనీనగర్ ఏరియాలో మహారాణిపేట సిఐ దివాకర్ యాదవ్, పోలీసు సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు సరిగ్గా లేని సౌండ్ పొల్యూషన్ కలిగిన 12 టూ వీలర్స్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా ఇళ్లను అద్దెకు ఇచ్చే వారికి తగు సూచనలు ఇచ్చారు.

ఉత్కంఠగా మధురవాడ సూపర్ లీగ్ సీజన్-1 క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర - కొమ్మాది: మధురవాడ కొమ్మాది గ్రౌండ్‌లో జరుగుతున్న మధురవాడ సూపర్ లీగ్ క్రికెట్ మొదటి సీజన్ టోర్నమెంట్ ఉత్కంఠ భరితంగా సాగుతోంది. మొత్తం 8 ఫ్రాంచైజీ జట్లు తలపడుతున్న ఈ పోటీలను పీ.ఎం.పాలెం సీఐ జీ.బాలకృష్ణ, ఎస్ఐ డి.రాము సందర్శించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సీఐ బాలకృష్ణ మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలని ఆయన హితవు పలికారు. ఐదు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతూ డిసెంబర్ 31 బుధవారం నాటి ఫైనల్స్‌తో ముగుస్తాయని అలాగే విన్నర్స్‌కు ట్రోఫీతోపాటు 50 వేల నగదు, రన్నర్స్‌కు ట్రోఫీతో పాటు నగదు బహుమతి ఉంటుందని నిర్వాహకులు పోతిన ఆనంద్, పిల్లా క్రాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో భార్గవ్ సామ్యూల్ పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, స్థానిక యువత పాల్గొన్నారు.

పర్యాటక భూమికి పర్యాటక వినియోగమే సముచితం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా కీలక వ్యాఖ్యలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రుషికొండలోని ప్యాలస్ వినియోగంపై కొనసాగుతున్న చర్చల నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఆస్తి మొదటి నుంచి పర్యాటక శాఖకు చెందినదేనని, నిర్మాణం చేపట్టిన సమయంలోనే ఇది పర్యాటక శాఖ భూమిపై నిర్మించబడిందని స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాంటి భవనాన్ని పర్యాటక ప్రాజెక్ట్‌గా వినియోగంలో ఉంచడమే సముచితమని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇంత భారీ నిర్మాణానికి నిర్వహణ ఖర్చులు అత్యంత అధికంగా ఉంటాయని, ఆదాయం రాకపోతే దీని సంరక్షణ ప్రభుత్వానికి భారంగా మారే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయంగా ఉంచితే గణనీయమైన ఆదాయం వచ్చే అవకాశాలు లేవన్నది వాస్తవమని తెలిపారు. అందుకే హోటల్ లేదా రిసార్ట్ తరహా పర్యాటక ప్రాజెక్ట్‌కు లీజుకు ఇవ్వడం ప్రభుత్వానికి లాభదాయకంగా ఉంటుందని అన్నారు. రుషికొండ వంటి ప్రాంతాలు సంవత్సరం పొడవునా పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగినవని, గతంలో కూడా ఇది ఒక పర్యాటక ప్రాజెక్ట్‌గా ఉన్న వాస్తవాన్ని విస్మరించరాదని పేర్కొన్నారు. చట్టపరంగా ఈ భూమి పర్యాటక శాఖదేనని, అందువల్ల పర్యాటకాభివృద్ధికి అనుబంధంగా దీనిని వినియోగించడమే సమంజసమని అన్నారు. ఇలాంటి ప్రదేశాన్ని ప్రభుత్వ కార్యాలయంగా మార్చడం పర్యాటక దృష్ట్యా సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రభుత్వం దాదాపు రూ.1,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టిన నేపథ్యంలో ఇంత పెద్ద స్థాయి మౌలిక సదుపాయాలను వినియోగం లేకుండా వదిలేయడం తగదని అన్నారు. తన అనుభవం ప్రకారం అనేక ప్రభుత్వ భవనాలు కాలక్రమంలో సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుతున్నాయని, దాంతో భవిష్యత్తులో మరింత అధిక ఖర్చులు తప్పవని హెచ్చరించారు. ఈ పరిస్థితిని నివారించాలంటే వృత్తిపరంగా నిర్వహించగల ప్రైవేట్ సంస్థను భాగస్వామిగా చేసుకోవడమే ఉత్తమ మార్గమని తెలిపారు. అలా చేస్తే భవనం సక్రమంగా సంరక్షించ బడుతుందని, ప్రభుత్వానికి కూడా స్థిర ఆదాయం లభిస్తుందని అన్నారు. ఇది భూమి స్వభావానికి, పర్యాటక శాఖ ఉద్దేశ్యాలకు పూర్తిగా అనుగుణంగా ఉంటుందని స్పష్టం చేశారు.

వ్యక్తిగత అభిప్రాయాలు వేరు - విధాన నిర్ణయం వేరు..

ఈ అంశంపై ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఆయన వ్యక్తిగతం అని అన్నారు. తన అభిప్రాయం మాత్రం ఉపసంఘం చేసిన సిఫారసులకు అనుగుణంగానే ఉందని స్పష్టం చేశారు. దీన్ని హోటల్ ప్రాజెక్ట్‌కు కేటాయించడమే ప్రభుత్వానికి దీర్ఘకాలికంగా సాధ్యమైన, ఆచరణీయమైన మార్గమని తాను భావిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి మౌలిక సదుపాయాలు నిలదొక్కుకోవాలంటే ఆదాయం అనివార్యమని, ఈ అంశంపై తుది నిర్ణయం క్యాబినెట్ ఉపసంఘానికి అప్పగించబడిందని, ఉపసంఘం తన నివేదికను సమర్పించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యేలతో చర్చలు జరిపి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తరువాతే తుది నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. అందువల్ల ఉపసంఘం తన ప్రక్రియను పూర్తిచేసి ఒక నిర్ణయానికి రావడానికి అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉచిత హోమియో మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం, కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 89వ ఉచిత హోమియో మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ క్యాంపులో 95 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా హోమియో మందులు ఇవ్వడం జరిగిందని ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు టి.జగన్నాధరావు, టిజె మోహన్, ఫౌండేషన్ ప్రతినిధులు కేఎస్ఎన్ మూర్తి, కె.చంద్ర శేఖర్, కేవి భానోజీరావు, కే.శ్రీనివాసరావు, కె.చంద్ర శేఖర్, ఫౌండేషన్ సభ్యులు వి.రాంబాబు, వి.శ్రీనివా సరావు, ఎం.శంకర్, బాల మాస్టర్, గంధ రాము, కిషోర్, వి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌ను డీఆర్ఎం తనిఖీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ రైల్వే స్టేషన్‌ను డీఆర్ఎం లలిత్ బోహ్రా తనిఖీ చేశారు. లలిత్ బోహ్రా బుకింగ్ ఆఫీస్ ఏరియా, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, క్యాటరింగ్ స్టాల్స్ తదితరాలను పరిశీలించారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫారమ్‌లపై భద్రతా ఏర్పాట్లు సమీక్షించారు. స్టేషన్‌ను సందర్శించిన సందర్భంగా స్టేషన్‌లోని పలు సౌకర్యాలను ఆయన పరిశీలించారు.



విశాఖపట్నం-కిరండూల్ మార్గంలో ప్రయాణీకుల సంఖ్యను సమీక్షించిన ఆయన అధిక డిమాండ్ ఉన్న రోజుల్లో అదనపు కోచ్‌లను జోడించి ప్రత్యేక రైలును నడపడం ద్వారా కిరండూల్ ప్యాసింజర్‌ను పెంచాలని అధికారులను ఆదేశించారు. కిరండూల్-విశాఖపట్నం ప్యాసింజర్ కూడా ఒక (01) జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌తో 30.12.2025 నుండి 21.01.2026 వరకు పెంచబడుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం (ఆపరేషన్స్) కె.రామారావు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మధురవాడలో ద్రోణంరాజు వర్ధంతి

విశాలాంధ్ర - కొమ్మాది: విశాఖపట్నం మధురవాడ చంద్రంపాలెం కృష్ణా నగర్ కాలనీ ద్రోణంరాజు సత్య నారాయణ కల్యాణ మండపం ఆవరణలో ఉన్న ద్రోణంరాజు విగ్రహానికి వైసీపీ నాయకులు, సింహాచలం, దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, వైసీపీ జిల్లా నాయకులు పిల్లా సూరిబాబు ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుడితి రామారావు, ఎండాడ క్వారీ అధ్యక్షులు పిల్లా అప్పన్న, వైసీపీ నాయకులు పోతిన పైడిరాజు, జగుపిల్లి అప్పారావు, పీస రామారావు, పిల్లా అప్పారావు, పోతిన కనకారావు, వాండ్రాసి కృష్ణ, వాండ్రాసి ఎల్లాజీ తదితరులు పూల మాలలు వేసి నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ద్రోణంరాజు సత్యనారాయణ దేశ, రాష్ట్ర, ఉత్తరాంధ్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారని, మధురవాడ అభివృద్ధికి కీలక పాత్ర పోషించారని అన్నారు. మరీ ముఖ్యంగా జిల్లా పరిషత్ చైర్మన్‌గా, పార్లమెంట్ సభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా, శాసన సభ్యులుగా విశాఖను ఎంతో అభివృద్ధి చేసారని అందులో మధురవాడ ను మరింత అభివృద్ధి చేశారని కొనియాడారు. చంద్రంపాలెం హైస్కూల్, విశాఖ గ్రామీణ బ్యాంకు, మాస్టర్ ప్లాన్ రోడ్లు, మధురవాడ ప్రాంతంలో మొదట విద్యుత్ సౌకర్యం కల్పించుట, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయడం వంటి మౌలిక సదుపాయాలు కల్పించారని కొనియాడారు.

గొప్ప మానవతావాది డాక్టర్ శాస్త్రి

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ విసి డాక్టర్ రవిరాజు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వైద్యుడిగా, వైద్య అధికారిగా గొప్ప మానవతా విలువలతో డాక్టర్ కె.ఎస్.ఎల్.జి.శాస్త్రి సేవలందించారని ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం మాజీ కులపతి డాక్టర్ టి.రవిరాజు అన్నారు. ఇటీవల మృతి చెందిన ప్రముఖ వైద్యాధికారి డాక్టర్ శాస్త్రి సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తిని మానవతా దృక్పథంతో సేవలు అందించడంలో శాస్త్రి సఫలీకృతమయ్యారని, కేవలం వైద్యుడిగానే కాకుండా వైద్య అధికారిగా వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వాహణలో శాస్త్రి చాలా సమర్థవంతంగా పనిచేశారని కొనియాడారు.

ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ ఎం.విజయ శేఖర్ మాట్లాడుతూ శాస్త్రి హుదుద్ తుఫాను సమయంలో, కరోనా సమయంలో చాలా ఉత్తమమైన సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ప్రముఖ గుండె జబ్బులు నిపుణుడు డాక్టర్ సివి రావు, డాక్టర్ ఎస్ఏఎస్ మూర్తి, డాక్టర్ బి.అన్నపూర్ణేశ్వరరావు, డాక్టర్ ప్రయాగ మురళీకృష్ణ, డాక్టర్ పేరాల బాలమురళీకృష్ణ, వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షులు టిఎస్ఆర్ ప్రసాద్, అధ్యక్షులు కావూరు చరణ్ కుమార్, కేసప్రగడ నరసింహమూర్తి, వేదుల హనుమంతరావు, శంకర్ నీలు, నండూరి సుబ్రహ్మణ్యం, ఆలమూరు ప్రభాకర్ డాక్టర్ శాస్త్రి అభిమానులు పాల్గొన్నారు.

పి.ఎం.పాలెంలో వైసీపీ ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర - పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డు పరిధిలోని పి.ఎం.పాలెం సంబు వానిపాలెంలో ఆదివారం వైసీపీ 'ఆత్మీయ సమావేశం' ఉత్సాహంగా జరిగింది. వార్డు అధ్యక్షులు పోతిన ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి

భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి బలమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యకర్తలు ఐక్యతతో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. స్థానిక సమస్యలను కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పోతిన హనుమంతరావు, గుడ్ల పోలిరెడ్డి,రోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిప్సా విహార యాత్ర

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం (జిప్సా) ఆధ్యర్యంలో సంఘ సభ్యులతో విహార యాత్ర నిర్వహించారు. నిరంతరం పాఠశాల నిర్వహణలో తలమునకలై వున్న ప్రైవేట్ పాఠశాలల కరెస్పాండెంట్స్ ఒక రోజు సేద తీరడం కోసం ఈ పిక్నిక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్టీల్ ప్లాంట్ దరి అప్పికొండ బీచ్‌లో ఈ విహార యాత్ర ఏర్పాటు చేశారు. ముందుగా సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేసి సంఘ పటిష్టత కోసం అనేక అంశాలు చర్చించారు. అనంతరం సభ్యులకు బీచ్‌లో ఆటలపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అలెన్ కాలేజీ వారి సౌజన్యం ఏర్పాటు చేయడం జరిగిందని కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ విహార యాత్ర లో జిప్సా గౌరవ అధ్యక్షుడు పి భాస్కర్ రావు, అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, కార్యదర్శి యస్.షణ్ముఖ రావు, కోశాధికారి ఎం.బాబురావు, అడ్వైజర్స్ పి.మురళీ సుందర్, జి.జగన్, కార్యవర్గ సభ్యులు రాము, ఆనందరావు, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు, వృద్ధులకు అధిక ప్రాధాన్యతనివ్వాలి

విశాలాంధ్ర - మల్కాపురం: సమాజంలోని దివ్యాంగులకు, వృద్ధులకు ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక 61వ వార్డులోని పల్లి వీధి, ప్రియదర్శిని కాలనీ, వెంకన్న పాలెంలలో సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాల్లో భాగంగా ఆదివారం విభిన్న వర్గాలతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వాలు సామాజిక బాధ్యతను విస్మరించరాదని అన్నారు. పల్లె వీధిలో సేవా శిబిరం నిర్వహిస్తున్న యూనిట్-1 ఆధ్వర్యంలో దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక సమావేశం జరిగింది. శ్రీ విఘ్నేశ్వర వెంకట సాయి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులు తమ విజయ గాథలను వలంటీర్లకు వినిపించారు. సంఘ అధ్యక్షులు ఎస్.శ్రీనివాస రావు, కుమార్, రవి, పెద్ద సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు. అంతకుముందు యూనిట్-1 వాలంటీర్లు బాలలకు వివిధ పోటీలను నిర్వహించి, బహుమతులను అందజేశారు. యూనిట్ -2 ఆధ్వర్యంలో ప్రకాష్ నగర్ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సేవా శిబిరంలో వినియోగదారుల హక్కులపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జి.మనోహర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం సామాజిక సమస్యలపై పారిశ్రామిక ప్రాంత జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ముప్పిడి గిరి వాలంటీర్లకు అవగాహన కలిగించారు. యూనిట్- 2 కార్యక్రమాలను సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయ దేవి పర్యవేక్షించారు.

సర్వేజనా సుఖినోభవంతు అన్న మాట చెబుతున్నది హిందువే

విశాలాంధ్ర - ఆనందపురం: సర్వేజనా సుఖినోభవంతు అంటూ విశ్వంలో ఉన్నటువంటి ప్రజలందరూ ఆరోగ్యంగా, సంతోషంగా గడపాలని కోరుకునేది ఒక హిందువేనని ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యకారిణి సభ్యులు యుగంధర్ అన్నారు. ఆదివారం సొంఠ్యాం గ్రామంలో హిందూ సమ్మేళనం కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. యుగంధర్ మాట్లాడుతూ ప్రపంచంలో అనేక సంస్కృతులు తమ తమ వారసత్వాన్ని కోల్పోయినప్పటికీ భారతదేశ సంస్కృతి ఉందన్నారు. ప్రపంచంలో రెండు వర్గాలు మన సంస్కృతి సాంప్రదాయాలను నాశనం చేయాలని వేల సంవత్సరాలు నుంచి ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. దీనిలోని భాగంగానే మాతృభాషను నాశనం చేశారన్నారు. ప్రకృతిని ఆరాధించే దేశము ఒక భారతదేశమే అన్నారు. క్షేత్ర సంఘచాలక్ దూసి రామకృష్ణ మాట్లాడుతూ మన ధర్మాన్ని మనం రక్షించుకుంటే అదే మనల్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ కోరుకొండ రామలక్ష్మీ, విశాఖ జిల్లా సహ కార్యవాహ తమ్మిన నర్సింగరావు, కోరుకొండ మూర్తి, దారు సతీష్, దేవుదు బాబు, డి అప్పలరాజు, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు సిద్ధం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి వైకుంఠ ద్వార దర్శనం (ముక్కోటి ఏకాదశి) ఏర్పాట్లపై డిప్యూటీ కమిషనర్, ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారి సుజాత సమన్వయ సమావేశం నిర్వహించారు. మంగళవారం ఉదయం గం.5 లకు సింహాద్రి నాథుని ఉత్తర ద్వార దర్శనం భక్తులకు కల్పిస్తున్నట్లు స్థానాచార్యులు టిపి రాజగోపాల్, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, సీతారామచార్యులు, డిప్యూటీ కమిషనర్, ఇన్‌చార్జ్

కార్యనిర్వహణాధికారి సుజాత తెలిపారు. ఇన్‌చార్జ్ ఈఈ రమణ మాట్లాడుతూ క్యూలైన్లు ఉచితం, రూ.100, 300, 500ల (విఐపి ప్రత్యేక దర్శనం) టిక్కెట్ల దర్శనాల కోసం ఏర్పాటు చేశామని, అవసరమైన చోట్ల అత్యవసర సేవల కోసం బయటికి త్రోవ ఏర్పాటు చేశామని, ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ట్రాఫిక్ జామ్ కాకుండా గోపాలపట్నం సిఐ ఎల్.నాయుడు బృందం, ట్రాఫిక్ పోలీసులు కలసి మొత్తం 190 పోలీసులు ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈఓ రాధ, ఏఈఓలు రమణ మూర్తి, తిరుమలేశ్వరరావు, పర్యవేక్షనాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పండగల విశిష్టత అందరూ తెలుసుకోవాలి

విశాలాంధ్ర - పద్మనాభం: రాబోయే ఉత్తరాయణం, బోగి, సంక్రాంతి పండుగల విశిష్టత ను తెలియజేయడానికి పద్మనాభం మండలంలోని చిన్నాపురం, కొయ్యపేట గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు గురువు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కర్మలు పూర్తిగా లేకుండా పోతే ఉత్తరాయణం రోజు మోక్షం కలిగి విముక్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు, సభ్యులు కే.త్రినాధరావు వి.భవాని, బి.అంకమ్మ, కే రాజు, బంగారు తల్లి, మంగమ్మ, సత్యం, సంతోష్ లక్ష్మిలు పాల్గొన్నారు.

గీతం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర - మధురవాడ: "హోమ్ కమింగ్" పేరిట గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఏటా నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం రెండు రోజులపాటు గీతం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. దేశ విదేశాలలో నివాసం ఉంటున్న గీతం పూర్వ విద్యార్థులు ఈ ఉత్సవాలకు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఈ సమ్మేళనంలో భాగంగా విద్యార్థుల సాంకేతిక ఉత్పత్తుల ప్రదర్శన, క్రీడా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. గీతం పూర్వ విద్యార్థుల రాకతో ఇంజనీరింగ్, ఫార్మశీ, సైన్స్, మేనేజ్‌మెంట్, దంత వైద్య విభాగాలలో అధ్యాపకులతో ముఖాముఖి కార్యక్రమాలను నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో సహా హజరు కావడంతో గీతం ప్రాంగణంలో వినోదాన్ని పంచే స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం నాడు పలు క్రీడా, స్సాంస్కృతిక కార్యక్రమాలతో గీతం ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన గీతం అధ్యక్షుడు, విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎమ్.శ్రీభరత్ గీతం ప్రగతిని, భవిష్య ప్రణాళికలను వివరించారు. గీతం విశ్వవిద్యాలయాన్ని ప్రపంచ శ్రేణి విద్యా సంస్థగా తీర్చిదిద్దడానికి బోధనతో పాటు పరిశోధనలపై ప్రధానంగా దృష్టి సారించామని తెలిపారు. కాలానుగుణంగా కోర్సులను మార్పుచేయడంతో పాటు అధ్యాపకులకు నిరంతర శిక్షణా కార్యక్రమాలతో బలోపేతం చేస్తున్నామని తెలిపారు. నూతన విభాగాలను ఏర్పాటు చేయడం, విద్యార్థులకు అవకాశాలు పెరిగేలా శ్రద్ధ తీసుకుం టున్నామని వెల్లడిరచారు. పూర్వ విద్యార్థులు గీతం ప్రగతిలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా మాట్లాడుతూ కృత్రిమ మేధ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ప్రస్తుత కాలంలో విద్యారంగాన్ని సహితం ప్రభావితం చేస్తుందని అందుకు తగిన విధంగా నూతన విద్యావిధానాన్ని అనుసరిస్తూ గీతం ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు. గీతం ప్రో%-%వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం స్టూడెంట్ లైఫ్ సహాయ డీన్ అరుణ్‌కార్తిక్, గీతం పూర్వవిద్యార్థుల సంబంధాల విభాగం డిప్యూటీ డైరెక్టర్ పి.నవీన్, వివిధ కళాశాలల డీన్‌లు పాల్గొన్నారు. పారిశ్రామిక వేత్తగా ఎదిగిన గీతం పూర్వవిద్యార్థి డిజివృద్ధి సంస్థ వ్యవస్థాపకుడు రాఘవన్ వెంకటేషన్, నారీకేర్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు కనుమూరి గాయత్రి, ప్రముఖ ఐటి సంస్థ (టిసిఎస్) యూరప్ వ్యవహారాల అధిపతి సి.సప్తగిరి, వి.ఎఫ్.ఎక్స్. నిపుణుడుగా పలు జాతీయ చలన చిత్రాలకు పని చేసిన జయకర్ ఆరుద్ర లకు విశిష్ట పురస్కారాలను అందజేశారు. గీతంలో విద్యాభ్యాసం తాము ఉన్నత స్థానాలకు చేరడానికి ఎంతో దోహద పడిరదని వారు తమ అభిప్రాయాలను వెల్లడిరచారు. ఈ సందర్భంగా గీతం పూర్వ విద్యార్థుల అసోసియేషన్ విశాఖ శాఖ నూతన సభ్యులను శ్రీభరత్ అభినందించారు. ఈ హెూమ్‌కమింగ్‌లో విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) డైరీ, క్యాలెండరును ఆదివారం మాజీ మంత్రి, భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అవనాపు అరుణ్ కుమార్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం సేవలు గురించి పరిచయం చేశారు. ఈ కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు అరుణ్ కుమార్, సుదర్శన్ పట్నాయక్, ఎంఎస్‌వి విశ్వనాథం, రామలక్ష్మి, సన్యాసి నాయుడు, కరుణాకర్, శంకర్, కృష్ణయ్య, అప్పారావు, నారాయణరావు, అప్పలనాయుడు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని గాజువాక రాజీవ్ కూడలి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పీసీసీ అధికార ప్రతినిధి, ఏపీ తెలంగాణ స్టేట్ ఐఎన్‌ఏటిఐసి వైస్ ప్రెసిడెంట్ జెర్రిపోతుల ముత్యాలు అధ్యక్షతన జరిగింది. కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం పార్టీ జెండా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముత్యాలు మాట్లాడుతూ 141 ఏళ్ళు చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్ళు

అధికారంలో ఉండి భారత దేశ సమైక్యత, సమగ్రతను కాపాడి ప్రజలు సంక్షేమం, బడుగు, బలహీన వర్గాల హక్కులు కాపాడుతు భారీ పరిశ్రమలు, ప్రాజెక్టలు స్థాపించి, సంపద సృష్టించి, భారత దేశానికి ప్రపంచంలో మంచి గుర్తింపు కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిందని అన్నారు. భారతదేశ ప్రజలు భద్రతగా ఉండాలంటే 2029లో జరుగు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని దేశంలో గెలిపించి రాహుల్ గాంధీని ప్రధాని చెయ్యాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయుకులు ఉరుకూటి అచ్చిబాబు, యరబాల భూలోక, ములకలపల్లి రాజుబాబు, శనివాడ వీరరావు, హరిబాబు, అప్పల నరసయ్య, ఆనంద్. నాయుడు, రాజు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై సానుకూలంగా స్పందిస్తాం

రెండో రోజు శ్రామిక ఉత్సవ్‌లో వీఎమ్మార్డీఏ కమిషనర్ తేజ్ భరత్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అభివృద్ధి అంటే ఆ ప్రతి ఫలాలు కింది వరకు చేరడమని, ఆ తరహా అభివృద్ధిని కోరుకొని పనిచేస్తున్నామని వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్ అన్నారు. అభివృద్ధికి కారకులైన కార్మికుల బతుకులు మెరుగుపడినప్పుడే సార్ధకత ఉంటుందన్నారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ఆదివారం రెండోరోజు శ్రామిక ఉత్సవ్ సభకు ముఖ్య అతిధిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమన్వయం, సమిష్టిగా పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు అత్యధికం విశాఖలో ఉన్నందున మధ్య, దిగువ మధ్యతరగతులకు ఇళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఎంఐజి గృహ నిర్మాణాలకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్మికుల కష్టాలు తీర్చడంలో సీఐటీయూ ప్రత్యేక కృషి చేస్తుందని కొనియడారు. సీఐటీయూ కార్మిక హక్కుల సాధనకు చేసే కృషిలో ఎన్నో విజయాలు సాధించిందన్నారు. కార్మిక సమస్యలు, ఏమైనా అభివృద్ధికి సంబందించిన సమస్యలు ఉంటే తాము సాను కూలంగా స్పందిస్తామని కమిషనర్ తెలిపారు. విశాఖకు రాబోతున్న రూ.వందలకోట్ల పెట్టుబడులతో ప్రభుత్వం

అనేక రోడ్లు అభివృద్ధి ప్రాజెక్ట్ లకు శ్రీకారం చు డుతుందన్నారు. వైజాగ్ సిటీ ని అడ్వంచెర్ హాబ్ గా మార్చే కృషి చేస్తున్నామన్నారు. వైజాగ్ లో 50 మురికి వాడాలున్నాయని వీటి రీ డెవలప్మెంట్ కోసం ప్లాన్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏవీ నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ధనలక్ష్మి, జిల్లా కన్వీనర్ మణి, శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ రమాప్రభ, అల్లూరి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి నరసింహరాజు పాల్గొన్నారు.

ఫరెవర్ మిస్ ఇండియా 2025 కిరీటం పొందిన నిహారిక

విశాలాంధ్ర - విశాఖపట్నం : జీ స్టూడియోస్, జైపూర్ రాజస్థాన్ వద్ద నిర్వహించిన గ్రాండ్ ఫినాలే ఫరెవర్ స్టార్ ఇండియా అవార్డ్స్ (ఎఫ్ ఎస్ ఐ ఏ) వేడుకలో నిహారిక బేతనపల్లి ఫరెవర్ మిస్ ఇండియా కిరీటం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎఫ్ ఎస్ ఐ ఏ నేషనల్ ఫినాలేలో ఫరెవర్ మిస్ టీన్, ఫరెవర్ మిస్ యూనివర్స్, ఫరెవర్ మిస్ ఇండియా మరియు ఫరెవర్ మిస్సెస్ వంటి ప్రముఖ విభాగాలలో పాల్గొనడం జరిగిందని ఫరెవర్ స్టార్ ఇండియా సీ ఈ ఓ రాజేష్ అగర్వాల్ మరియు డైరెక్టర్ జయ చౌహాన్ సారధ్యంలో ఫరెవర్ స్టార్ ఇండియా అవార్డ్స్ జీ స్టూడియోస్‌లో 21 డిసెంబర్ 2025న బ్రహ్మాండంగా నిర్వహించా రన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఒక అందాల పోటీ. ఈ పోటీ కొరకు సుమారు 10,000 నామినేశాన్లు రావటం జరిగినది. వాటిలో 105 మంది ఫినాలే లు ఎంపిక చేయబడ్డారన్నారు. ఫరెవర్ స్టార్ ఇండియా దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతూ, ప్రతి ఒక్కరు ఈ పోటీలలో పాల్గొనేందు మరియు రాణించుటకు ప్రోత్సాహం అందిస్తున్నాదన్నారు. ఈ వేదిక ద్వారా మహిళలకు ఆత్మ విశ్వాసం మరియు వ్యక్తిత్వ వికాసం లక్ష్యంగా వారు ఈ పోటీలలో టైటిల్స్ మరియు కిరీటాలు గెలుపొందే అవకాశాలు కలిగిస్తుందన్నారు. ఫరెవర్ స్టార్ ఇండియా అవార్డ్స్ (ఎఫ్ ఎస్ ఐ ఏ) గ్రాండ్ ఫినాలేలో నీహారిక బెతనపల్లి ఫరెవర్ మిస్ ఇండియా 2025 కిరీటాన్ని గెలుచుకుందని చెప్పారు. నిహారిక విశాఖపట్నం ప్రాంతంలో పుట్టి పెరిగినది ఇక్కడి ప్రశాంత జీవనం, సంస్కృతి సంప్రదాయతల పట్ల మంచి అవగాహన పొందుతూ పెరిగిందన్నారు. నిహారిక బి.టెక్ చదివి, గత మూడు సంవత్సరాలుగా, బెంగుళూరు మెట్రోపాలిటన్ నగరంలో టెక్నికల్ సంస్థలో పనిచేస్తూ వేగవంతమైన జీవన శైలి, వైవిధ్యం గమనించినది. ఆమె క్రమశిక్షణ మరియు నైపున్యతకు పునాది విద్యా రంగం, కళలు మరియు అథ్లెటిక్స్‌లను మిళితం చేసే విభిన్న రంగాలలో ఆమెకు ఉన్న ప్రావీణ్యతే కారణం అన్నారు. నీహారిక కూచిపూడి నృత్యం మరియు కర్ణాటక సంగీతంలో తొమ్మిది సంవత్సరాలకు పైగా శిక్షణ పొందారని, ఆమె 2008 మరియు 2011లో మహా బృంద నాట్యం గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కూచిపూడి నృత్యాలలో పాల్గొన్నట్టు చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో బహుళ కర్ణాటక సంగీత కచేరీలను నిర్వహించిందని మరియు షాట్ పుట్, హైజంప్ మరియు డిస్కస్ త్రోలో బంగారు పతకాలు గెలుచుకుని క్రీడలలో సైతం రాణించినట్టు తెలిపారు. నిహారిక ఫరెవర్ మిస్ ఇండియా విభాగంలో జాతీయ విజేతగా నిలవటంతో పాటు, ఆమె తొలుత మిస్ బెంగుళూరు కిరీటం గెలుచుకుని ఇప్పుడు జాతీయ స్థాయిలో మిస్ ఇండియా గా విజేతగా నిలిచినట్టు తెలిపారు.

శరీరంలో తగినంత నీరు ఉండాలి

- లయన్స్ క్యాన్సర్, జనరల్ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య ఉమామహేశ్వరరావు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఎల్లప్పుడు మన శరీరంలో తగినంత నీరు ఉండటం అవసరం అని లయన్స్ క్యాన్సర్ అండ్ జనరల్ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ, ఏయు మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వి. ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. డిహైడ్రేషన్ వలన కలిగే అనర్థాల గురించి ఆయన వివరిస్తూ సాధారణంగా మనం ఎండకాలంలోనే నీళ్లు ఎక్కువగా తాగాలని అనుకుంటాం, కానీ చలికాలంలో దాహం వేయకపోవడం వల్లే అసలు ముప్పు పొంచి ఉంటుందన్నారు. శీతాకాలపు పొడి గాలి కూడా మనల్ని నిర్జలీకరణం చేస్తుందని తెలియజేసారు. వేసవిలో మనం చెమటలు పట్టడం, వేడిగా ఉండటం వల్ల హైడ్రేటెడ్‌గా ఉండటానికి జాగ్రత్తపడతామన్నారు. శీతాకాలంలో కూడా డీహైడ్రేషన్‌కు దారితీసే అనేక విషయాలు జరుగుతాయన్నారు. యువకుల కంటే ఈ పరిస్థితికి ఎక్కువగా గురయ్యే వృద్ధులు ముఖ్యంగా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డీహైడ్రేషన్ వలన మలబద్ధకం, మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు, పడిపోవడం, గాయం నయం కావడం ఆలస్యం కావడం వంటి అరోగ్య సమస్యలు ఎదురవుతాయి అన్నారు. డీహైడ్రేషన్ అయినప్పుడు గందరగోళం, తక్కువ రక్తపోటు, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి అన్నారు. శరీరానికి తరచుగా తగినంత ద్రవాలు అందకపోవడం వల్ల ఇటువంటి ఆరోగ్య సమస్యలు సంభవిస్తాయన్నారు.

చలికాలంలో ఇలా గుర్తించాలి:

చలి వాతావరణం హైడ్రేషన్‌ను ఎలా ప్రభావితం చేస్తుందో గుర్తించడం, సమస్యలను ఎదుర్కోవడానికి చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం అన్నారు. చలికాలంలో శరీరం నీటిని కోల్పోతోందని గుర్తించడం కష్టం. మూత్రం రంగు లేత పసుపు రంగులో ఉంటే హైడ్రేటెడ్‌గా ఉన్నట్లు, ముదురు పసుపు రంగులో ఉంటే నీరు తక్కువైందని అర్థం. నీరు తక్కువ అవడం వల్ల పెదవులు పగలడం, చర్మం పొడిబారడం జరుగుతాయన్నారు. ఏ కారణం లేకుండా అలసట, తల తిరగడం జరుగవచ్చున్నారు. గోరువెచ్చని నీరు త్రాగడం, అల్లం, పుదీనా, తులసి వంటి టీలు తాగడం, పండ్లు తినడం వలన శరీరానికి తగినంత ద్రవాలను అందించవచ్చు అన్నారు. ముఖ్యంగా పిల్లలు వృద్దులు దాహం

అనిపించకపోయినా శీతాకాలంలో తరచుగా గోరువెచ్చని నీరు తాగుతూ ఉండాలి అని సూచించారు.

నేడు కలెక్టరేట్‌లో

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం - పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోను చెక్ చేసుకోవచ్చున్నారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చున్నారు.

పిజిఆర్ఎస్ కార్యక్రమములో భాగంగా ప్రభుత్వం వారి ఆదేశముల మేరకు ఇకనుండి రెవెన్యూకు సంబంధించిన అర్జీలు విషయమై “రెవిన్యూ క్లినిక్” ను కలెక్టర్ కార్యాలయములో ది. 29.12.2025 వ నుండి ప్రతీ సోమవారం ప్రత్యేకముగా నిర్వహించనున్నట్లు జేసీ మయూర్ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. సదరు కార్యక్రమముకు జిల్లా లో గల అందరు రెవిన్యూ డివిజినల్ అధికారులు తహసీల్దారులు పాల్గొంటారు. అర్జీదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా తెలియజేసారు.